మందుబాబుల ఆగడాలకు అడ్డేదీ?

తోటపల్లిగూడూరు: మండలంలోని పలు ప్రభుత్వ భవనాలు, విద్యాలయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. సాయంత్రమైతే చింతపిక్కులాట మొదలుకొని పేకాట, మద్యపానం, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలకు తెరలేస్తున్నాయి. ముఖ్యంగా తీర ప్రాంతంలో అత్యధిక మంది విద్యార్థులు చదువుకుంటున్న చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. చీకటి పడితే చాలు మందుబాబులు ఈ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన సముదాయాన్ని ఓ బార్‌గా మార్చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు మందుబాబులు విందులు, చిందులతో చెలరేగిపోతున్నారు. ఒక్కో సమయంలో మందుబాబుల మధ్య గొడవలు, ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అంతేకాక కొందరూ ఇక్కడ వ్యభిచారమూ సాగుస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో వీరి ఆగడాలకు అంతులేకుండా పోతోంది.

దీని గురించి అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల ఆవరణలో దర్శనమిస్తున్న మద్యం బాటిళ్లు

నార్తురాజుపాళెంలో కావలి వైపు వెళ్లే బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



కొడవలూరు వైపు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికుల అవస్థలు



బస్ షెల్టర్ లేక ఇక్కట్లు

కొడవలూరు: మండలంలో ఎంతో ప్రాధాన్యం కలిగిన నార్తురాజుపాళెంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం అనేక మండలాలతో పాటు నెల్లూరు, కావలి పట్టణాలకు వెళ్లేందుకు కూడలి ప్రాంతం. పైగా ఇక్కడ ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి కళాశాలలకు విద్యార్థులు వస్తుంటారు. కొడవలూరుతో పాటు విడవలూరు, అల్లూరు, దగదర్తి మండలాల నుంచి ప్రతీ అవసరానికి ఇక్కడకే వస్తుంటారు. అందువల్ల నిత్యం ఈ కూడలిలో బస్సుల కోసం వేచి ఉండేవారు అధిక సంఖ్యలో ఉంటారు. ఇక్కడ వీరు కాస్త తలదాచుకొనేందుకు బస్ షెల్టర్ సదుపాయం లేదు. మండుటెండలోనైనా, జోరు వర్షంలోనైనా రోడ్డు పక్కనే నిలబడాల్సి ఉంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెల్లూరు వైపునకు వెళ్లే ప్రయాణికుల కోసం ఒక బస్ షెల్టర్ నిర్మించారు. అటు వైపు వెళ్లేందుకు వేచి ఉండే ప్రయాణికులకు మాత్రం ఈ షెల్టర్ ఎంతో ఆసరాగా ఉంటోంది. అయితే కొడవలూరు మీదుగా అల్లూరు, విడవలూరు మండలాలకు వెళ్లే ప్రయాణికులు, కావలి వైపు వెళ్లే వారికి మాత్రం ఎలాంటి షెల్టర్ లేదు. దీంతో ప్రయాణికులు రోడ్డు పక్కన వేచి ఉంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి ఇక్కడ బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

వీరాంజనేయునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో కొలువైన అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకు పూజ, అష్టోత్తర పూజలు చేశారు.

జేకేరెడ్డికి మాతృ వియోగం

ఇందుకూరుపేట: మాజీ ఎమ్మెల్యే జేకేరెడ్డి తల్లి జక్కా కామేశ్వరమ్మ(105) వయోభారం, అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామం జగదేవిపేటలో బుధవారం ఉదయం జరుగనున్నట్లు మనుమడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి తెలిపారు.

కార్యకర్తల రక్షణకే డిజిటల్ బుక్



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కోవూరు మండల కేంద్రంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తల రక్షణ కోసమే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని పార్టీ నాయకులు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం డిజిటల్ బుక్ కూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ పరిశీలకుడు కొండూరు అనిల్‌బాబు పాల్గొని, మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను అక్రమ అరెస్టులు చేస్తూ ఆనందం పొందుతుందన్నారు. రాష్ట్రంలో లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. రాబోయే కాలంలో కార్యకర్తలు, నాయకులకు అండగా ఉండేందుకే జగన్ డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారన్నారు. ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం తమ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారికి రాబోయే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు తప్పవన్నారు. అధికారులు కూటమి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ చేస్తున్న చేష్టలకు భవిష్యత్తులో పదవీ విరమణ పొందినా వదిలేది లేదన్నారు. కార్యకర్తలు, నాయకులు వారు ఎదుర్కొన్న ఇబ్బందులను డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇబ్బందులకు కారణమైన వారిని కఠిన శిక్షలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చి పట్టణ, రూరల్ కన్వీనర్లు షేక్.షాహుల్, సతీష్‌రెడ్డి, కోవూరు జెడ్పీటీసీ శ్రీలత, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, లీగల్‌సెల్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ పాలనకు మూల్యం చెల్లించక తప్పదు

కోవూరు: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి అధ్వర్యంలో డిజిటల్ బుక్ కూఆర్ కోడ్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, రాష్ట్ర ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్, కోవూరు నియోజకవర్గ పరిశీలకుడు కొండూరు అనిల్‌బాబు హాజరై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందన్నారు. ఈ క్రమంలో డిజిటల్ బుక్‌లో ఆ ఇబ్బందులను నమోదు చేస్తే, రేపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వచ్చిన తరువాత సంబంధిత అధికారులు, నాయకులపై తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ డిజిటల్ బుక్ ద్వారా ప్రతి కార్యకర్త ఆవేదన నేరుగా జగన్‌మోహన్‌రెడ్డికి చేరుతుందని, ఇది కార్యకర్తలకు జగనన్న ఇచ్చిన రక్షణ కవచంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, నాయకులు లక్ష్మీకుమారి, వెంకమ్మ, చెంచురెడ్డి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఆశ్రిత వైష్ణవి



గీతామాధురి



మనీషా



దేవీ ప్రియ

వెంకటాచలం: అనకాపల్లి జిల్లా కేడీపేటలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు గొలగమూడి విద్యార్థినులు ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థినులు పి.ఆశ్రిత వైష్ణవి, కె.గీతామాధురి, తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.మనీషా, ఎనిమిదో తరగతి విద్యార్థిని దేవీ ప్రియ జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో వారిని హెచ్ఎం బి.లక్ష్మీ కామేశ్వరి దేవి, పీడీ షబిక మంగళవారం అభినందించారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని కరెస్పాండెంట్ ఎ.రామసుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన ఆర్.టాన్సీ, షేక్ జాకీర్ అలీ, ఎం.జెసికారాణిలను పాఠశాలలో అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేష్, పీఈటీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఊర్లకు వెళ్లే ముందు సమాచారమివ్వండి

• సీఐ శివరామకృష్ణారెడ్డి



పొదలకూరు: దసర సందర్భంగా ఊర్లకు వెళ్లే వారు ముందస్తు సమాచారం ఇస్తే పోలీసు నిఘా ఉంచుతామని, దీనివల్ల దొంగతనాలను అరికట్టేందుకు వీలు ఉంటుందని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.శివరామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పండగల వేళ ఊర్లకు వెళ్లే వారు బంగారు నగలను వెంట తీసుకుని వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సిందిగా సూచించారు. ఆలయాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ఆటోలు, బస్సుల ప్రయాణం , ఒంటరిగా ఇంటికి వెళ్లే సమయంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చైన్‌స్నాచర్లు ఉంటారని, చుట్టుపక్కల గమనిస్తూ వెళ్లాలన్నారు. దసర సందర్భంగా ఆలయ కమిటీ వారు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలంటే ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా

కోవూరు: ఉపాధ్యాయుల సమస్యలపై అక్టోబర్ 7న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో కో–కన్వీనర్ పి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో కోవూరు టీఎన్సీ ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన, 12వ పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, మెమో 57 అమలు, పెండింగ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల సాధన కోసం ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. హెడ్‌మాస్టర్ వై.చెంచురామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పాఠాలు బోధించే స్వేచ్ఛ కలిగించాలని, బోధేతర పనుల నుంచి ముక్తి కలగాలని కోరారు. ఫ్యాప్టో నేతలు డేవిడ్ చిన్నబాబు, ఖాజావలీ మాట్లాడుతూ డిమాండ్ల సాధనకై అందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు జుల్ఫికర్ అలీ అహ్మద్, ఎస్.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసులు, కె.నాగిరెడ్డి, బి.వెంకయ్య, ఎంపీ సుబ్రహ్మణ్యం, రఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫ్యాప్టో కో-కన్వీనర్ మురళీకృష్ణ

రాయితీపై విత్తనాల పంపిణీ

పొదలకూరు: రైతులకు రాయితీపై కంది, మినుము విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ వి.ప్రతాప్ మంగళవారం తెలిపారు. కంది కిలో పూర్తి ధర రూ.109.50 కాగా రాయితీపై రూ.76.65లకు అందజేస్తామన్నారు. కిలోకు రూ.32.85 రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. మినుము కిలో పూర్తి ధర రూ.130 కాగా రాయితీపై రూ.96.60 అందజేస్తామని, రూ.41.40 రాయితీ లభిస్తుందన్నారు.

విత్తనాలు అవసరమైన రైతులు ముందుగా రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా సూచించారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. జొన్నవాడ రోడ్డు సాయినగర్‌కు చెందిన దిల్షాద్‌కు జెండావీధికి చెందిన గౌస్‌బాషాతో వివాహమైంది. వారికిద్దరు సంతానం. గౌస్‌బాషా ఎంబ్రాయిడరీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అతను తరచూ భార్యకు చెప్పకుండా ఎటో వెళ్లి కొద్దిరోజుల అనంతరం తిరిగి వచ్చేవాడు. పుట్టింటికి వెళ్లి డబ్బులు తీసుకురావాలని భార్యపై ఒత్తిడి చేసేవాడు. నాలుగునెలల క్రితం అతను వెళ్లిపోయాడు. గతనెల 29వ తేదీ రాత్రి ఇంటికొచ్చిన గౌస్‌బాషా షాపు పెట్టుకునేందుకు డబ్బులివ్వాలని భార్యను అడిగాడు. ఆమె సమాధానం చెప్పేలోపే దాడి చేశాడు. ఈ విషయం పోలీసులకు చెబితే చంపుతానని, లేదా నీ పేరు, మీ అమ్మ, తమ్ముడి పేర్లు రాసి చనిపోతానని భార్యను బెదిరించి వెళ్లాడు. బాధితురాలు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గేదె అపహరణపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు ఖాళీ స్థలంలో కట్టి ఉంచిన గేదెను ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. పడారుపల్లి చలపతినగర్‌లో ఎం.ప్రభాకర్ నివాసముంటున్నాడు. అతను ఎనిమిది గేదెలను పెట్టుకుని పాలు వ్యాపారం చేస్తున్నాడు. రోజూ గేదెల్ని తన ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో కట్టేసేవాడు. గతనెల 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు గుర్తుతెలియని దుండగులు గేదెను అపహరించుకుని వెళుతుండటాన్ని గుర్కా చూసి బాధితుడికి తెలియజేశాడు. ప్రభాకర్ సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితులు సుందరయ్య కాలనీకి చెందిన మంజునాథ్, వెంకటేష్‌గా గుర్తించారు.

బాధితుడు వారి కోసం గాలించినా జాడ తెలియరాలేదు. ప్రభాకర్ మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గాదేవీ.. నమోస్తుతే

పొదలకూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం లలితా సహస్రనామార్చన, ఖడ్గమాల, త్రిశతి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మిగా..

పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజ్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పండ్ల రసాలతో అభిషేకం గావించారు.

మరుపూరులో..

మండలంలోని మరుపూరు గ్రామంలో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మట్టెపు శ్రీనివాసులు దంపతులు, మర్రి సుధాకర్ దంపతులు వ్యవహరించారు. వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇనుకుర్తిలో..

మండలంలోని ఇనుకుర్తిలో ఉన్న కాంతమ్మతల్లి ఆశ్రమంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి సుబ్బారెడ్డిస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేడుకగా..

తోటపల్లిగూడూరు: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. నరుకూరులోని రాజరాజేశ్వరి ఆలయం, పేడూరులోని చాముండేశ్వరి ఆలయం, వరిగొండలోని జ్వాలాముఖి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు జరుగుతున్నాయి. నరుకూరు ఇందిరాకాలనీలో కొలువైన రాజరాజేశ్వరి ఆలయంలో, వరిగొండ దేవళాలమిట్టలో ఉన్న జ్వాలాముఖి ఆలయంలో అమ్మవార్లు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ క్రమంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలకు వెంకటకృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

మనుబోలులో..

మనుబోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు దసరా చావిడిలో మహిషాసురమర్దినిగా, కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం శర్మ అమ్మవారికి అలంకారాలు చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా మనుబోలులో దాసరి బ్రదర్స్, పోలేరమ్మ ఆలయంలో అక్కుపల్లి సురేష్, చాముండేశ్వరి వ్యవహరించారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మంగళవారం దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పుణ్యాహవచనం, కలశపూజలు, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, మహానవావరణ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

➡ **ఇందుకూరుపేట:** దసరా వేడుకల సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజలకు స్థానికులు గంగపట్నం నాగేశ్వరరావు– శిరీష దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పొదలకూరు: మరుపూరులో దుర్గాదేవిగా..



తోటపల్లిగూడూరు: నరుకూరు రాజరాజేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



ఇందుకూరుపేట: పల్లకిసేవలో అమ్మవారు



మనుబోలు: దుర్గాదేవిగా పోలేరమ్మ



మనుబోలు: దసరా చావిడిలో మహిషాసురమర్దినిగా..